ప్రజాశక్తి
బుధవారం 15 మే 2024 8 పేజీలు


గుంటూరు


పల్నాడు



భారీగా పెరిగిన పోలింగ్ !

- గెలుపుపై ఎవరి అంచనాలు వారివి!
- పోలింగ్ సరళిపై ప్రధాన పార్టీల్లో తేలని గణాంకాలు
- పల్నాడు ఘర్షణలపై టిడిపి, వైసిపి మాటల యుద్ధం
- ఎన్నికలకమిషన్, పోలీసుఅధికారులు విఫలమని ఆరోపణ

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పోలింగ్ సరళిపై రాజకీయ పార్టీలు ఎవరికి వారు తమ అంచనాలను రూపొందించుకుంటున్నారు. పైకి గాంభిర్యంగా అంచనాలు వేసుకుంటున్నా లోపల మాత్రం పలువురు అభ్యర్ధులకు భయం కూడా వెంటాడుతూనే ఉంది.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో పల్నాడు జిల్లాలో రికార్డు స్థాయిలో 85.69 శాతం పోలింగ్ జరిగింది. ఇంత భారీగా పోలింగ్ జరగడంపై వైసిపి, టిడిపి నాయకులకు ఫలితాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో భారీగా ఘర్షణలు జరిగినా పోలింగ్ శాతం అనూహ్యంగా పెరిగింది. గుంటూరు లోక్‌సభ స్థానం పరిధిలో 17 లక్షల 91 వేల 543 మంది ఓటర్లు ఉండగా 14 లక్షల 12 వేల ముగ్గురు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 78.91 శాతం పోలింగ్ నమోదైంది. పల్నాడు జిల్లాలో మొత్తం 17 లక్షల 34 వేల 858 మంది ఓటర్లుండగా 14 లక్షల 86 వేల 594 మంది ఓటేశారు.

ప్రధానంగా పెదకూరపాడు నియోజకవర్గంలో 89.18 శాతం పోలింగ్ జరగడంపై టిడిపి,వైసిపి నేతలు ఎవరికి వారు తమకు అనుకూలంగా ఓటర్లు స్పందించారని చెప్పు కుంటున్నారు. చిలకలూరిపేటలో 85.44, నర్సరావుపేట 81.06, సత్తెనపల్లి 86.97, వినుకొండ 89.22 శాతం, గురజాల 84.30,మాచర్ల 84.30 శాతం పోలింగ్ జరిగింది. పల్నాడులో టిడిపి, వైసిపి ఢీ అంటే ఢీ అనే పరిస్థితుల్లో అత్యధికంగా పోలింగ్ జరగడంపై ప్రభుత్వ సంక్షేమపథకాలకు ప్రజలకు సానుకూలంగా స్పందించి తమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపిస్తున్నారని వైసిపి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెప్పారు. అయితే ప్రజలుపెద్ద సంఖ్యలో తరలివచ్చి టిడిపికి అనుకూలంగా ఓటు వేసి తమ పార్టీని అధికారంలోకి తీసుకువస్తున్నారని, వైసిపి ప్రభుత్వానికి ఉన్నవ్యతిరేకత ఇందుకు నిదర్శనమని మాచర్ల అభ్యర్థి ▶ 2లో

2వ పేజీలో గుంటూరు జిల్లాలో నియోజకవర్గాల వారీ పోలింగ్ వివరాలు

కొత్తగణేశునిపాడు గ్రామంలో ఉద్రిక్తత

- వైసిపికి చెందిన వారి ఇళ్లపై టిడిపి నాయకుల దౌర్జన్యం
- దేవాలయంలో తలదాచుకున్న మహిళలు, చిన్నారులు
- ఇళ్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ధ్వంసం


3 లో

పల్నాట ఆరని మంటలు

- కారంపూడిలో టిడిపి-వైసిపి ఘర్షణ - వాహనాల దహనం
- రంగంలోకి దిగిన ఎస్పీ - బలగాల మోహరింపు

6లో



అనుమానాస్పద స్థితిలో దళితుని యువకుడు మృతి

ప్రజాశక్తి - తుళ్లూరు



అనుమానాస్పద స్థితిలో దళిత వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వడ్డమానులో మంగళవారం వెలుగు చూసింది. మృతుని తల్లి మరిమ్మ ఫిర్యాదు మేరకు.. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలనికి చెంది. మురికిపూడి బుల్లిబాబు (33) వడ్డమానుకు చెందిన చుండు నరసింహారెడ్డి (నర్సిరెడ్డి) దగ్గర పదేళ్లుగా బ్రిక్స్ పనిచేస్తున్నాడు. కొంతకాలంగా బ్రిక్స్ పని మానేసి నర్సిరెడ్డికి చెందిన గేదెలను కాస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం బుల్లిబాబు బంధువైన మురికిపూడి నాగేశ్వరరావుకు నర్సిరెడ్డి ఫోన్ చేసి బుల్లిబాబు మూడ్రోసుల నుండి అన్నం తినకుండా ఎన్నికల మద్యం తాగుతున్నాడని, సోమవారం కూడా మద్యం తాగి చెట్టు కింద పడిపోయాడని చెప్పాడు. ఈ సమాచారం తెలుసుకున్న బుల్లిబాబు తల్లిదండ్రులు మరియమ్మ, గోపాల్, మరికొందరు బంధువులు వెళ్లి చూడగా బుల్లిబాబు చనిపోయి ఉన్నాడు. దీంతో మరియమ్మ తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడు బుల్లిబాబు ఒంటిపై రక్తపు గాయలున్నాయని, సహజ మరణం కాదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నర్సిరెడ్డి, అతని కుమారుడు, కుటుంబ సభ్యులతో పాటు బుర్రా వెంకటరెడ్డి, నరేంద్రరెడ్డి తన కొడుకు మృతికి కారణమని ఫిర్యాదులో ఆరోపించారు. తన కొడుకు ఎప్పుడు జీతం అడిగినా నర్సిరెడ్డి కులం పేరుతో తిట్టేవాడనే విషయం తన కుమారుడు తరచూ తనకు చెబుతండేవాడని, దీనిపై విచారణ చేయాలని కోరారు.

పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ : కలెక్టర్


పోలీసు కవాతులో కలెక్టర్, ఎస్పీ

- తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కొనసాగింపు
- మాచర్లకు అదనపు పోలీసు బలగాలు
- సమస్యాత్మక గ్రామాలకు ఎస్‌పి బిందుమాధవ్

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ అమలు చేస్తూ జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు జిల్లా మొత్తం 144 సెక్షన్ కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మాచర్ల, పెదకూరపాడు, నర్సరావుపేట, గురజాల, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో ఘర్షణలు జరగడంపై ఉన్నతాధికారులు స్పందించారు. ▶ 2లో

మాచర్లలో తీవ్రఉద్రిక్తత...

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద భారీ బందోబస్తు 2 లో

డాక్టర్ రామచంద్రరెడ్డికి సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల నియోజకవర్గ ఇండియా వేదిక తరుపున కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రామచంద్రరెడ్డిని ఎలుకల సందర్భంగా సోమవారం వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడెంలో దాడి చేసి గాయపరిచిన సంగతి తెలిసిందే. పట్టణంలోని ఆయన నివాసంలో ఆయన్ను సిపిఎం నాయకులు బండ్ల మహేష్, వై.సురేష్, కె.వెంకటరత్నం పరామర్శించారు.

పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ : కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

కారంపూడి మండలం పేటసన్నిగండ్లలో మంగళవారం జరిగిన ఘర్షణల నేపథ్యంలో జిల్లా ఎస్పి బిందుమాధవ్ గ్రామానికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు. ఆయన మాచర్లలోనే బస చేయాలని నిర్ణయించుకున్నారు. పల్నాడులో జరిగిన ఘర్షణలను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్ర డిజిపి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పల్నాడుకు అదనపు బలగాలు పంపినట్టు తెలిపారు. శాంతిభద్రతలను అదుపు చేసేందుకు ఘర్షణకు అవకాశం ఉన్న గ్రామాలకు తక్షణం కేంద్ర బలగాలను పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పేటసన్నిగండ్ల గ్రామానికి కూడా కేంద్ర బలగాలు చేరుకున్నాయి.




సూచనలిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ విజయమ్మ

మాతృ మరణాలను నివారించాలి

ప్రజాశక్తి - బాపట్ల

మాతృ మరణాలు పూర్తిస్థాయిలో నివారించి తల్లి, బిడ్డ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిఎం అండ్ హెచ్ఒ ఎస్ విజయమ్మ వైద్యా ధికారులకు సూచించారు. తన కార్యాలయంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందితో మాతృ మరణాల నియంత్రణపై మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాల వల్లే అధికంగా మాతృ మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రధానంగా చిన్న వయసులో జరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ, వార్డు సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవ సంస్థల సహకారంతో టీములు ఏర్పాటు చేయాలని అన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీకి తప్పనిసరిగా నాలుగు సార్లు వైద్యాధికారులతో ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఎనీమియాను గుర్తించినట్లయితే తప్పనిసరిగా ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి నిరంతరం ఆరోగ్య స్థితిగతులను పరివేక్షించాలని అన్నారు. కాన్పు కష్టమైనప్పుడు ఆసుపత్రికి వస్తే గర్భిణీలు వివరాలు నమోదు చేయాలని చెప్పారు. జనన ప్రణాళికతో నిత్యం పర్యవేక్షణలో వారికి అవసరమైన అదనపు వైద్య సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలకు పౌష్టికాహారంతోనే తల్లి, బిడ్డ ఆరోగ్యమనే అంశంపై గర్భిణీలకు ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డిఐఓ టి వెంకటేశ్వర్లు, ఎం సౌజన్య, రోహిణి రత్నశ్రీ, శేషు కుమార్, ప్రేమ పావని, మాతృ మరణాల కమిటీ సభ్యులు డి రామకృష్ణ హనుమాన్, ప్రసూతి వైద్య నిపుణులు సునీత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.



మూతబడిన దుకాణాలు



బారీకేడ్లు పెట్టి పహారా కాస్తున్న పోలీసులు

మాచర్లలో తీవ్రఉద్రిక్తత

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద భారీ బందోబస్తు

బిక్కుబిక్కుమంటున్న జనం

ప్రజాశక్తి - మాచర్ల

అత్యంత సమస్యాత్మక నియోజకవర్గమైన మాచర్లలో టిడిపి-వైసిపి ఘర్షణలు కొనసాగుతున్నాయి. కారంపూడిలో మంగళవారం ఘర్షణ నేపథ్యంలో మాచర్లలో కూడా ఘర్షణ జరుగుతాయేమోనని ఎమ్మెల్యే ఇంటిదగ్గర భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి 8 గంటల సమయంలో మాచర్ల పరిసర గ్రామాల నుండి వైసిపి నాయకులు కార్యకర్తలు కారంపూడికి వెళ్లారు. వీరంతా తిరిగి మాచర్లకు వచ్చారని, ఇక్కడ కూడా దాడులకు యత్నిస్తున్నారని ప్రచారం జరిగింది. మరోవైపు వెల్దుర్తి నుండి టిడిపికి చెందినవారూ వస్తున్నారని పుకార్లు బయలుదేరడంతో పట్టణంలో భయాందోళనలు నెలకొన్నాయి. ఎనిమిది గంటలకే వ్యాపారులంతా దుకాణాలను మూసివేసివెళ్లిపోయారు. ఈ ఘర్షణల వల్ల తమకేం జరుగుతుందోనని టిడిపి,వైసిపిలకు చెందిన సాధారణ కార్యకర్తలు, అభిమానులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు స్థానిక బస్టాండ్ సెంటర్లో బారీకేడ్లు పెట్టి ఎమ్మెల్యే ఇంటి వైపే కాకుండా బస్టాండ్‌లోకి కూడా వాహనాలను వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ప్రయాణికులు బస్టాండ్ నుండి బయటకు వచ్చి మెయిన్ రోడ్డుపై ఆగి ఉన్న బస్సులకి ఎక్కి వెళ్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రయాణికులు కూడా తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద పోలీసులతోపాటు వైసిపి కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో మోహరించారు. ఇరు పార్టీల నాయకులకు చెందిన ఇళ్ల వద్ద కూడా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భారీగా పెరిగిన పోలింగ్ !

(మొదటి పేజీ తరువాయి)

జూలకంటి బ్రహ్మారెడ్డి వ్యాఖ్యానించారు.

రాజధాని ప్రాంతమైన మంగళగిరి, తాడికొండలో కూడా 80 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. రాజధాని మార్పును వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న ప్రజలు తమ ఓటు ద్వారా స్పందించారని తాడికొండ టిడిపి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లాల ప్రధానంగా టిడిపి, వైసిపి మధ్య తీవ్ర పోటీ జరిగింది. దీంతో మొత్తం గ్రామాలు, మండలాల వారీగా గతంలో పోలయిన ఓట్లు, ఈ సారి పోలయిన ఓట్లు, వివిధ సామాజిక వర్గాల్లో వచ్చిన మార్పు తదితర అంశాలపై టిడిపి, వైసిపి నేతలు అంచనాల రూపకల్పనలో నిమగ్నమయ్యారు. మెజార్టీ నియోజకవర్గాల్లో టిడిపి, వైసిపి హోరాహోరీగా తలపడ్డాయి. తెనాలి, గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పు, ప్రత్తిపాడులో గతంలో జనసేనకు పడిన ఓట్లు ఈసారి టిడిపితో కలవడం వల్ల తమకు లాభించిందని టిడిపి నాయకులు సంబరపడుతున్నారు. పోలింగ్ 80 శాతం దాటితే ప్రభుత్వ వ్యతిరేక ఓటు బాగా ఉన్నట్టేనని టిడిపి అంచనా వేస్తుంది. తాము అమలు చేసిన సంక్షేమ పథకాలవల్లే ఎక్కువ శాతం పోలింగ్ జరిగిందని ఇది తమకు సానుకూల ఫలితాలకు సంకేతమని వైసిపి నాయకులు అభిప్రాయపడుతున్నారు. 2019లో మాదిరిగానే వైసిపికి 12 నుంచి 15 సీట్లు వస్తాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. టిడిపి మాత్రం తమకు 1994 ఫలితాలు పునరావృత్తం అవుతాయని చెబుతోంది.

అయితే పల్నాడులో గతంలో కంటే భిన్నంగా టిడిపి, వైసిపి మధ్య హోరాహోరీగా ఘర్షణలు జరిగాయి. తమపార్టీ గెలుస్తుందన్న భావనతో టిడిపి కార్యకర్తలు వైసిపితో ఢీ అంటే ఢీ అనే స్థాయికి వెళ్లడం, కొన్ని గ్రామాల్లో టిడిపి వారే వైసిపివారిపై ముందుగా దాడులు చేయడం ఆపార్టీలో పెరిగిన ధీమాకు తార్కారణంగా నిలుస్తోంది. ప్రస్తుతం శాంతిభద్రతలను కాపాడటంతో పోలీసు అధికారులు ఎన్నికల కమిషన్ విఫలమయ్యాయని మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు నంబూరు శంకరరావు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట లోక్‌సభ వైసిపి అభ్యర్థి అనిల్‌కుమార్ ధ్వజమెత్తారు. టిడిపివారు కూడా ఎన్నికల కమిషన్ పటిష్టమైన చర్యలు తీసుకోలేదని, పోలీసు అధికారులు శాంతిభద్రతలను కాపాడలేకపోయారని విమర్శించారు. గెలుస్తుందన్న ధీమాతో ఘర్షణల ద్వారా పోలింగ్ శాతం తగ్గించేందుకు కుట్ర జరిగిందని వైసిపి ఆరోపించగా ఓటమి భయంతోనే వైసిపి ఈవిఎంలను కూడా ధ్వంసం చేసిందని టిడిపి ఆరోపించింది.

గుంటూరు జిల్లాలో నియోజకవర్గాల వారీ పోలింగ్ వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలయిన ఓట్లు	శాతం
తాడికొండ	2,07,615	1,81,603	87.47
మంగళగిరి	2,92,432	2,50,742	85.74
పొన్నూరు	2,27,133	1,93,019	84.98
తెనాలి	2,67,624	2,03,832	76.16
ప్రత్తిపాడు	2,67,888	2,21,090	66.53
గుంటూరుపశ్చిమ	2,78,158	1,85,065	66.53
గుంటూరుతూర్పు	2,50,691	1,76,652	70.47
మొత్తం	17,91,543	14,12,003	78.81

వైసిపి మాచవరం మండల అధ్యక్షునిపై దాడి

ప్రజాశక్తి -పిడుగురాళ్ల

ఎన్నికలు ముగిసినా గురజాల నియోజకవర్గంలో వైసిపి, టిడిపి మధ్య ఘర్షణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మంగళవారం రాత్రి సమయంలో మాచవరం మండలం వైసిపి అధ్యక్షుడు చౌదరి సింగరయ్య, నాయకుడు దారం లచ్చిరెడ్డిలపై టిడిపి నాయకులు దాడి చేశారు. మాచవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న కారు ఎక్కుతుండగా కొత్తపాలెం, మరో గ్రామనికి చెందిన కొందరు వ్యక్తులు చౌదరి సింగరయ్య, దారం లచ్చిరెడ్డిపై దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వెంటనే వారిని పిడుగురాళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనలో వైసిపి అధ్యక్షుడు చౌదరి సింగరయ్యకు కాలు, కుడిచెయ్యి విరిగిపోయాయి. మరో వైసిపి నాయకుడు దారం లచ్చిరెడ్డికి కుడిచెయ్యి విరిగింది. మాచవరం మండలంలోని కొత్తగణేశునిపాడులో వైసిపి వారి ఇళ్లపై జరిగిన దాడి మరవకముందే కాసు మహేష్‌రెడ్డి వాహనాలపై దాడి జరగడం మాచవరం



వైసిపి నాయకులపై దాడి జరగడంతో మాచవరం ప్రజలు భయాందళనకు గురవుతున్నారు. ఈ రాజకీయ గొడవలు ఎంత వరకు దారితీస్తాయో అని భయాందోళన చెందుతున్నారు.

కొత్తగణేశునిపాడు గ్రామంలో ఉద్రిక్తత

- వైసిపికి చెందిన వారి ఇళ్లపై టిడిపి నాయకుల దౌర్జన్యం
- దేవాలయంలో తలదాచుకున్న మహిళలు, చిన్నారులు
- ఇళ్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ధ్వంసం



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గురజాల నియోజకవర్గంలో ఎన్నికలు ముగిసిన కాని రాజకీయ వేడి రోజురోజుకి పెరుగుతుంది.ఎన్నికల పోలింగ్ కేంద్రంలో మెదలైన వివాదం చిలికి చిలికి గాలివానైంది. టిడిపి వర్గీయలు దాడితో మాచవరం మండలంలోని కొత్త గణేశునిపాడు గ్రామంలోని వైసిపికి చెందిన వారిపై సోమవారం రాత్రి టిడిపి ఆద్వర్యంలో దాడులకు దిగారు. వైసిపికి చెందిన నాయకులే లక్ష్యంగా కర్రలు, ఇనుప రాడ్లు సిద్ధ చేసుకుని వారి ఇళ్ళపై మూకమ్మడిగా దాడులకు తెగబట్టారు. దీంతో ఇళ్ళలో మగవారు ఇళ్ళ నుండి పారిపోయారు. మహిళలు, చిన్నారులను వృద్ధులను తీసుకోని పొలల దారిలో పారిపోగా కొందరు గ్రామ శివారులోని గంగమ్మ దేవాలయంలో తలదాచుకున్నారు. రాత్రి 8గంటల నుండి 11గంటల వరకు ఇళ్ళపై దాడులు చేసినట్లు వారు తెలిపారు. ఇళ్ళ ధ్వంసం చేయడమే కాకుండా ద్విచక్ర వాహానాలు, జీవనోపాధిగా ఉన్న ఆటోలను ధ్వంసం చేశారు. పోలీసులుకు సమాచారం ఇచ్చిన కనీసం మావైపు కన్నెత్తి కూడ చూడలేదని దిక్కుతోచని స్థితిలో దేవాలయంలో రాత్రంతా దాక్కున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ళను ధ్వంసం చేయడమే కాకుండా వారి ఇళ్ళలోని వస్తువులు కూడా పగల కొట్టారని భాదితులు తెలిపారు. ఇక్కడ ఉండటానికి వీలు లేదంటూ గ్రామం విడిచి వెళ్ళకపోతే చంపేస్తామంటూ టిడిపి నాయకులు దౌర్జన్యం చేశారని, ఇళ్ళ నుండి పారిపోయిన తమ కుటంబ సభ్యులు ఎక్కడ ఉన్నారో కూడ తెలియడంలేదని వారు వాపోతున్నారు. రాత్రి నుండి చిన్న పిలల్ని, వృద్ధులను పెట్టుకోని రాత్రంతా దేవలయంలో ఎవరు వచ్చి దాడి చేస్తారమోనని భయంతో దిక్కుతోచని స్థితిలో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బతుకున్నామని వారు వాపోయారు. ఎన్నికల నిర్వహణలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా విఫలం అయ్యిందని సమస్యాత్మక గ్రామమైన మా గ్రామంలో ఎన్నికల నిర్వహణకు కేవలం నలుగురు పోలీసులను మాత్రమే ఏర్పాటు చేశారని అన్నారు.రాత్రి మాపై దాడులు చేసే సమయంలో వారికి సమాచారం అందిస్తే మేము ఇద్దరమే ఉన్నాము వారు వందకు పైగా ఉన్నారు మేము ఏం చేయలేం అని పోలీసులు చేతులెత్తేసారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితేకాని డొక్కాడని మా కుటంబాలపై ఇళ్ళపై,జీవనోపాధిపై దాడులు చేశారని రాజకీయ గొడవలు ఉంటే రాజకీయంగా చూసుకోవాలికాని అర్ధరాత్రి సమయంలో ఇళ్లపై దాడులకు తెగబడటం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని సుమారు 30కిపైగా ఇళ్ళపై దాడులు జరిగాయని రాజకీయాల వల్ల మా కుటంబాలు సమస్యలలో పడుతున్నాయని వారు తెలిపారు.

భాదితులను పరామర్శించిన ఎమ్మెల్యే కాసు,ఎంపి అభ్యర్థి అనీల్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని కొత్తగణేశునిపాడు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది.గ్రామంలో సోమవారం రాత్రి సమయంలో వైసిపి వర్గీయలపై జరిగిన దాడి గురించి తెలుసుకొని భాదితులను పరామర్శించేందుకు వైసిపి ఎమ్మెల్యే కాసు,ఎంపి అభ్యర్థి అనీల్ కుమార్ పిడుగురాళ్ళ నుండి పదులు సంఖ్యలో కార్లుతో గ్రామనికి చేరుకున్నారు. గంగమ్మ దేవాలయంలో తలదాచుకున్న భాదితలును పరామర్శించారు. ఈ సందర్భంగా భాదితులు వారి ఆవేదనను వారికి తెలియజేశారు.ఈ సందర్భంగా కాసు మాట్లడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీస్ వ్యవస్థ పూర్తి వైపల్యం చెందిందని కేవలం వైసిపికి అండగా నిలబడ్డారని యాదవ, రజక సామాజిక వర్గాలకు చెందిన వారిపై టిడిపి నాయకులు పైశాచికంగా దాడులు చేశారని, సుమారుగా200మందికి పైగా రాత్రంతా వారిపై దాడులు దిగారని అన్నారు. పోలీసులకు మెరపెట్టుకున్న వారు వినలేదని కేవల పోలీసుల నిర్లక్ష్యం వల్లనే వారిపై దాడులు జరిగాయని అన్నారు. భాదితలకు వైసిపి పార్టీ అండంగా ఉంటుందని వారికి న్యాయం జరిగే వరకు పోరాడతామని నిందుతలపై కేసులు నమోదు చేసే వరకు పోరాడతామని అన్నారు. 24గంటల్లో పోలీస్ ఉన్నాతాధికారులు గ్రామనికి వచ్చి భాదితలకు న్యాయం చేయాలని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇటీవల టిడిపిలో చేరిన ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి బిసిలపై జరిగిన దాడి గురించి ఎందుకు ప్రశ్నించలేకపోయావు అని అన్నారు. ఇన్నాళ్ళు నీకు ఈగ్రామంలో అండగా ఉండి నిన్ను రెండు సార్లు గెలిపించుకున్న వారికి ఇప్పుడు ఏం సమాధానం చెబుతావు అని ప్రశ్నించారు. ఎంపి అభ్యర్థి అనీల్ కుమార్ యాదవ్ మాట్లడుతూ భాదితులపై జరిగిన దాడి అప్రజాస్వామికం అని అన్నారు. అనంతరం భాదితల ఇళ్ళపై జరిగిన దాడులను పరిశీలించారు. ఈ క్రమంలో గ్రామంలోని టిడిపి నాయకుల ఇళ్ల సమీపంలోని కొన్ని ఇళ్ళను పరిశీలించేందకు వెళుతుండగా గ్రామంలోని టిడిపి నాయకులు వారిపై దాడికి సిద్ధం అయ్యే విధంగా ఇరు వర్గాలు కవ్వింపు చర్యలు చేసుకున్నారు. దీంతో పోలీసులు ఇరు వర్గలకు నచ్చ చెప్పారు. గ్రామం నుండి వైసిపి వర్గీయులు వెనుతిరగగా పిడుగురాళ్ళ వైపు నుండి టిడిపికి చెందిన కొందరు వ్యక్తులు కర్రలతో వారిపై దాడులు చేసేందకు వచ్చారు. పోలీసలు వారిని చెదరగొట్టే సమయంలో పరిస్థితి ఉద్రిక్తం అయ్యింది. టిడిపికి చెందిన కొందరు వైసిపి కార్లుపై రాళ్ల దాడి చేశారు. దీంతో కార్లు అద్దాలు పగిలిపోయాయి.



టిడిపి శ్రేణుల దాడిలో దెబ్బతిన్న వైసిపి అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డికి చెందిన కారు

ఆసుపత్రిలో రోగులను భయబ్రాంతులకు గురిచేశారు

ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఓటమి భయంతో తాము టిడిపి నాయకులు కార్యకర్తలపై దాడులు చేశామని ఉమ్మడి కూటమి నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పల్నాడు రోడ్డులోని వైసిపి పార్లమెంట్ కార్యాలయంలో వైసిపి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పి అనిల్ కుమార్ యాదవ్ తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడారు. సోమవారం మధ్యాహ్నం వరకు నరసరావుపేట నియోజకవర్గం తో పాటు పల్నాడు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ సరళి ప్రశాంతంగా జరిగిపోయిందని గత ఎన్నికల్లో పార్లమెంటు స్థానంతో పాటు పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో వైసిపి జెండా ఎగిరిందని మళ్లీ ఇదే పరిస్థితి కొనసాగుతుందని తెలుసుకున్న టిడిపి నాయకులు కార్యకర్తలు ఏదో విధంగా ఎన్నికల్లో గెలుపొందటమే లక్ష్యంగా భావించి వైసిపి శ్రేణులపై దాడులకు తెగ పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ చదలవాడ ఇతర ప్రాంతాల నుంచి భౌన్సర్లను దింపారని తన ఇంటి పై దాడి చేసి తమ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న రోగులను సైతం భయ బ్రాంతులకు గురి చేసేలా వ్యవహరించారన్నారు. దీనిని తమ అనుచరులు ప్రతిఘటించడంతో వివాదం చోటుచేసుకుందన్నారు. దీనిపై పల్నాడు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా స్పందన లేదన్నారు. ఎన్నికల కమిషన్ దగ్గర నుండి జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్ ప్రతి ఒక్కరు కూడా కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించాలని మండిపడ్డారు. అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో టిడిపి దాడులను అడ్డుకోవాలని తను స్వయంగా ఎస్పీకి ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా తనకు సమాధానం ఇచ్చారని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అనిల్ యాదవ్

పల్నాడు ప్రాంతం అంటే పౌరుషాల గడ్డ అనుకొని ఇక్కడ అడుగు పెట్టానని కానీ మహిళలపై జరిగిన దాడులు ఇళ్లలో ఎవరు లేని సమయంలో ఇళ్లను ధ్వంసం చేయటం వంటి ఘటనలు చూస్తే ఆ స్థాయి పౌరుషం నాకు అనిపించలేదని ఎద్దేవా చేశారు. ఏదైనా ఉంటే ధైర్యంగా ముందుకు వచ్చి పోరాటం చేయాలని రానున్న ఫలితాలు వైసిపికి అనుకూలంగా ఉంటాయని రెండవసారి వైసిపి అధికారంలోకి తథ్యమన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, యువ నాయకులు డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత సోల్జర్ కన్నుమూత



ప్రజాశక్తి - యడ్లపాడు

రోడ్డు ప్రమాదంలో ఆర్మీలో పనిచేసిన సోల్జర్ ముద్దు విజయసారధి (40) కన్నుమూశారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉన్నవ గ్రామం ఉదయపురి కాలనీకి చెందిన విజయసారధి చిలకలూరిపేటలో రిపేరుకు ఇచ్చిన సెల్‌ఫోన్ తీసుకుని వచ్చేందుకు బంధువు ఏసోబుతో కలసి ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. ఈ క్రమంలో యడ్లపాడులోని ఎన్‌ఎస్‌ఎల్ టెక్స్‌టైల్ నూలుమిల్లు సమీపంలో వచ్చేసరికి బైక్ అదుపుతప్పింది. దీంతో ఎదురుగా పోలీసులు ఏర్పాటు చేసిన బ్యారికేడ్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో విజయసారధి తీవ్రంగానూ, ఏసోబుకు స్వల్పగాయాలైయ్యాయి. స్థానికులు గమనించి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. విజయ సారధి ఆర్మీలో సోల్జర్‌గా చేరి దేశానికి సేవచేశాడు. వ్యక్తిగత కారణాలతో వాలంటరీ రిటైర్డ్‌మెంట్ తీసుకున్నాడు. అప్పటి నుంచి గ్రామంలో స్వయం ఉపాధిగా సెంట్రింగ్ వర్క్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య ప్రియదర్శిని, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - పొన్నూరు

స్థానిక మండల పరిధిలోని చింతలపూడి- మాచవరం ప్రధాన రహదారి జిబిసి రోడ్డు పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పైడి శేషయ్య(60) మత్యువాత పడ్డాడు. మాచవరం గ్రామానికి చెందిన ఓ ద్విచక్ర వాహనదారుడు చింతలపూడి శివారు లో సైకిల్ పై వస్తున్న వృద్ధుడిని వెనుక వైపు నుండి ఢీకొనగా శేషయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన నేపథ్యంలో జి బి సి రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించి పోయింది. పొన్నూరు రూరల్ స్టేషన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని శివపంచనామా నిమిత్తం పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్సై భార్గవ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కొలకలూరులో గడ్డివామి దగ్ధం

రెండ్రోజుల వ్యవధిలో సోదరుల గడ్డివాములకు నిప్పు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి గ్రామం కొలకలూరు బాపయ్యపేటలో మంగళవారం గడ్డివాము దగ్దమైంది. రైతు ముత్తే శ్రీనివాసరావుకు చెందిన ఆరున్నర ఎకరాల గడ్డివాము పూర్తిగా కాలి బూడిదయ్యింది. స్థానికులు మంటలను అదుపు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. సమాచారం తెలుసుకున్న తెనాలి అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపుచేశారు. రైతు మాట్లాడుతూ ఇటీవల తన సోదరుడి రెండున్నర ఎకరాలు గడ్డివాము కూడా ఇదే తరహాలో కాలిపోయిందని, ఇలాంటి ఘటన పునరావతం కాకుండా తన గడ్డివాము వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఐతే గడ్డివాము వద్ద అగ్గిపెట్టె దొరకడంతో ఎవరైనా గడ్డివాము తగలబెట్టి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. సుమారు రూ 75 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తంచేశారు.


ఈవీఎంల నెమ్మదిలో కుట్ర ఉందేమో : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట : పోలింగ్‌లో ఈవీఎంలు చాలా నెమ్మదిగా పని చేశాయని, దీనివల్ల పోలింగ్ శాతం తగ్గి టిడిపికి ఎక్కువ సీట్లు వచ్చే అవకాశాన్ని కొంత కోల్పోతామని ఎన్‌డిఎ కూటమి తరుపున చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈవీఎంలు సరిగా పని చేయకపోవడంలో కుట్ర ఏమైనా ఉందేమోననే అనుమానం వ్యక్తం చేశారు. స్థానిక పండరిపురంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పోలింగ్ రోజున వైసిపికి చెందినవారు రాళ్లు, కర్రలతో కామూరులో దాడి చేసి నలుగురి తలలు పగటగొట్టారని, ఓటమి భయంతోనే ముందస్తు దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. గురజవోలు, బుక్కాపురం, సాతులూరు, చిలకలూరిపేట పట్టణం ఎస్సీ కాలనీ, పురుషోత్తపట్నంలో ఏదో విధంగా గొడవలు చేసి ఈవీఎంలను ఆపాలని ప్రయత్నించారని, ఈ క్రమంలో అధికార పార్టీ ఒత్తిడి వల్ల పోలీసులు ప్రేక్షకపాత్రే వహించారని ఆరోపించారు. పల్నాడు జిల్లాలో వైసిపివారు ఒక పథకం ప్రకారం గొడవలు సృష్టించాలని చూశారని, టిడిపి శ్రేణులు గట్టిగా నిలబడ్డారని అన్నారు. .

పెదకూరపాడులో 89.18 శాతం పోలింగ్

ప్రజాశక్తి - పెదకూరపాడు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పెదకూరపాడు నియోజకవర్గంలో 89.18 శాతం నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి శ్రీరాములు మంగళవారం తెలిపారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భారీ ఎత్తున పోలింగ్ జరిగింది. పెదకూరపాడు మండలంలోని బలుసుపాడు, అచ్చంపేట మండలం వేల్పూరు, బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెం గ్రామాల్లో అర్ధరాత్రి వరకూ ఓటర్లు క్యూ లైన్లలో నిలబడి ఓటేశారు. నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,32,453 గాను, రెండు లక్షల ఏడు వేల 314 ఓట్లు పోలయ్యాయి. బెల్లంకొండ మండలంలో మొత్తం ఓట్లు 27099 కాగా 23998 ఓట్లు (88.56 శాతం) పోలయ్యాయి. అచ్చంపేట మండలంలో 53,406 ఓట్లకు గాను 47,135 (88.2 6శాతం), క్రోసూరు మండలంలో 50,607 ఓట్లకుగాను 45,854 (90.61 శాతం), పెదకూరపాడు మండలంలో 42,237 ఓట్లకుగాను 38,257 (90.58 శాతం), అమరావతి మండలంలో 59,104 ఓట్లకుగాను 52,070 (88.1) ఓట్లు పోలయ్యాయి.



సత్తెనపల్లిలో 86.97శాతం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 86.97 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 242047 మంది ఓటర్లు ఉండగా 210500మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు.118400మంది పురుష ఓటర్లకు గాను 103116మంది ఓటు హక్కు వినియోగిచుకోగా 123635 మంది మహిళా ఓటర్లు ఉండగా,107381మంది మహిళలు ఓటింగ్ లో పాల్గొన్నారని అలాగే ఇతరులు 12మందికి గాను 3 గురు ఓటు హక్కు వినియోగించుకున్నారని వివరించారు.

అరవిందబాబును కలిసిన శ్రేణులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని ఎన్‌డిఎ కూటమి తరుపున నరసరావుపేట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. అరవిందబాబుపై దాడి, పోలింగ్ ముగిసిన నేపథ్యంలో టిడిపి శ్రేణులు ఆయన్ను కలుసుకునేందుకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని టిడిపి కార్యాలయానికి మంగళవారం తరలివచ్చారు. వారితో అరవిందబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



స్ట్రాంగ్ రూముల్లోకి ఈవీఎంలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కాకాని పంచాయితీ పరిధిలో గల జేఎన్టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను భద్రపరిచే ఏర్పాటును జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం పరిశీలించారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు బూరే సర్వేశ్వర నరేంద్ర, శ్రీహరి ప్రతాప్ సింగ్ షాహితో కలిసి పరిశీలించిన అనంతరం స్ట్రాంగ్ రూములకు సీలు వేశారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు : ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ముగిసిన అనంతరం ఇవిఎంలను మంగళవారం తెల్లవారుజామున నరసరావుపేట మండలం కాకాని గ్రామ పరిధిలోని జెఎన్‌టియు కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముకు తరలించి రూముకు సీల్ వేశామని, ఈ ప్రక్రియను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ బూరే సర్వేశ్వర్ నరేంద్ర, పల్నాడు జిల్లా ఎన్నికలాధికారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సమక్షంలో చేశామని పల్నాడు ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి, తగిన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆయా గ్రామాల్లో జరిగిన గొడవలకు సంబంధించి, మళ్లీ అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఆయా గ్రామాలు, వార్డుల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలు వారు అందరూ సంయమనం పాటించాలని, ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీసు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని చెప్పారు.





టిడిపితో పోలీసులు కుమ్మక్కు

దాడులపై ప్రేక్షకపాత్ర - రీపోలింగ్ జరపాలి : అంబటి రాంబాబు

ప్రజాశక్తి సత్తెనపల్లి టౌన్

ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని, కొందరు పోలీస్ అధికారులు టిడిపితో కుమ్మక్కయ్యారని వైసిపి సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు ఆరోపించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో వైసిపి నాయకులపై టిడిపి వారు దాడులు చేస్తున్నారని పోలీసు అధికారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసిన పట్టించుకోలేదన్నారు. రూరల్ సిఐ రాంబాబు అయితే చాలా దురుసుగా ప్రవరించారని, నియోజకవర్గంలో తనను పర్యటించవద్దంటూ గృహ నిర్బంధంలో ఉంచారని అన్నారు. మరోవైపు టిడిపి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మాత్రం నియోజకవర్గంలోని పోలింగు కేంద్రాలను పరిశీలించడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. నియోజకవర్గంలో జరిగిన దాడుల్లో పోలీసుల వైఫ్యలం తేటతెల్లమైందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ఘర్షణలు జరుగుతున్నప్పుడు రూరల్ సిఐ ఫోన్‌చేస్తే అంతా అయిపోయాక వెళ్లటం సినిమాను తలపించిందన్నారు. టిడిపి నాయకుడు కన్నా నాగరాజుతో రూరల్ సిఐ కుమ్మక్కయ్యి వారికి అనుకూలంగా పనిచేసారని ఆరోపించారు. నార్నెపాడులో చీఫ్ పోలింగ్ ఏజెంట్ ఉన్న తన అల్లుడు ఉపేష్‌పై దాడి జరుగుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించటం ఏమిటని ప్రశ్నించారు. ఘర్షణలలో గాయాల పాలైన వారు తనకు ఫోన్ చేస్తుంటే మంత్రిగా ఉండి తానేమీ చేయలేక పోయానని అన్నారు. చాగాంటివారిపాలెంలో ఓటర్లను టిడిపి నాయకులు కన్నా నాగరాజు బెదిరిస్తున్నారనే సమాచారం తనకు తెలిసిన వెంటనే రూరల్ సిఐకు ఫోన్ చేయగా అనుచితంగా మాట్లాడరని చెప్పారు. డీఎస్పీ అయితే పట్టించుకోలేదని, దీంతో తానే ఘటనా స్థలికి వెళ్లగా కన్నాకు అనుకూలంగా వ్యవహరిస్తూ తనను బయటకు పంపే ప్రయత్నం చేశారని విమర్శించారు. దమ్మాలపాడు, నార్నెపాడు, చీమలమర్రి గ్రామాల్లో రిపోలింగ్ జరపాలని, దీనిపై ఎన్నికల అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు.

పోలింగ్ శాతం తగ్గించేందుకే వైసిపి దాడులు : కన్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఓటమి భయంతో ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని తగ్గించడానికే వైసిపి నాయకులు అరాచకాలు, అడ్డంకులు సృష్టించారని ఎన్‌డిఎ కూటమి తరుపున సత్తెనపల్లి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసిపి నాయకులు దగ్గరుండి రౌడీ మూకలతో రిగ్గింగ్ చేయించారని ఆరోపించారు. ప్రతి గ్రామంలో ముందు రోజే దాడులు చేయడానికి వైసిపి నాయకులు రాళ్లు కర్రలు సమకూర్చుకున్నారుని చెప్పారు. అల్లరి మూకలు గంజాయి, మద్యం సేవించి టిడిపి కార్యకర్తలపై తెగబడ్డారని అన్నారు. అరాచకాలను కూటమి పార్టీల కార్యకర్తలు ధైర్యంగా ఎదుర్కొని పోలింగ్ శాతం పెరిగేందుకు దోహద పడ్డారని అన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి యెలినేడి రామస్వామి, ముప్పాళ్ల మండల అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, సత్తెనపల్లి మండల అధ్యక్షులు ఆళ్ల అమరేశ్వరరావు పాల్గొన్నారు



విలేకర్లతో మాట్లాడుతూ కన్నా లక్ష్మీనారాయణ

రైతులు, దళితుల కోసం పోరాడిన ఆమంచి నరసింహారావు

26వ వర్ధంతి సందర్భంగా సిపిఎం నివాళులు

ప్రజాశక్తి - క్రోసూరు

ఆమంచి నరసింహారావు గొప్ప స్వాతంత్ర్య సమరయోధులుగానే కాకుండా రైతుల సమస్యలపైనా పోరాడారని, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికీ విశేషంగా కృషి చేశారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు అన్నారు. మండల కేంద్రమైన క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో ఆమంచి నరసింహారావు 26వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జి.రవిబాబు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో రవిబాబు మాట్లాడుతూ 1916లో పుట్టిన నరసింహారావు స్వాతంత్ర్యానికి ముందే ఎన్‌జి రంగాతో కలిసి పోరాడారన్నారు. సత్తెనపల్లి తాలూకా ప్రాంతంలో పుల్లరి వ్యతిరేక పోరాటంలో, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోనూ చురుగ్గా పాల్గొన్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి, కార్యకర్తల గుర్తించి తీర్చిదిద్దడానికి కీలకంగా పని చేశారని చెప్పారు. ఊటుకూరు నుండి పుతుంబాక వెంకటపతిని గుర్తించి రాజకీయాల్లోకి తేవడానికి కృషి చేశారని అన్నారు. వేల్పూరు సర్పంచ్‌గా గ్రామంలో చెరువు పోరంబోకు భూమిని పట్టా భూమిగా మార్పు చేసి జెడ్‌పి పాఠశాల నిర్మాణానికి పాటుపడ్డారన్నారు. దళితులపై వివక్షతకు వ్యతిరేకంగా నిలబడ్డారని, దళితులకు డొంక రోడ్డు నిర్మించి వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత పాలకులు దేశ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని, సామాన్యులపై ధరలు, పన్నుల భారం మోపుతున్నారని చెప్పారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఆమంచి నరసింహారావు స్ఫూర్తితో పోరాడదామని పిలుపునిచ్చారు. సభలో సిపిఎం అచ్చంపేట మండల కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్లు, నాయకులు సిహెచ్ యేసయ్య, జి.చిన్నప్ప, కె.గోపిరెడ్డి, జి.మహేష్, పి.రాజు పాల్గొన్నారు.



నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి
గుంటూరు
5
బుధవారం 15 మే 2024

మంగళగిరి నియోజకవర్గ ఓటర్లకు జొన్నా ధన్యవాదాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి చైతన్యానికి మారుపేరని మరోమారు నిరూపితమైందని ఇండియావేదిక బలపరచిన సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు తెలిపారు. తెల్లవారకముందే నియోజకవర్గ ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి ఉత్సాహంగా ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్లందరికి మంగళవారం ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఓటుహక్కు వినియోగించు కునేందుకు ఓపిగ్గా పోలింగ్ బూతుల్లో వేచిఉండటం వెల్లివిరిసిన



ప్రజాచైతన్యానికి ప్రతీక అని అన్నారు. అహర్నిశలు కష్టపడి పని చేసిన సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :మంగళగిరి నియోజకవర్గంలో తన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు ఇండియా వేదిక బలపరిచిన మంగళగిరి సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. గెలుపోటములు సహజమని చెప్పారు. ఆ విషయాన్ని పక్కన పెడితే గత 45 రోజుల నుంచి సిపిఎం గెలుపు కోసం వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసి పోలింగ్ చివరి వరకు పని చేసిన కార్యకర్తలకు, అభిమానులకు అభినందనలు తెలిపారు. సిపిఎం రాజకీయ విధానాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో విజయం సాధించామని చెప్పారు. వివిధ రాజకీయ పార్టీల వైఖరి, ఏ పార్టీ ఏ వర్గ ప్రయోజనాల కోసం పని చేస్తుందో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగామని చెప్పారు. పోలీసింగ్ వ్యవస్థ సరిగ్గా పనిచేయకపోయనా నియోజకవర్గంలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగాయన్నారు. ఎవరు గెలిచినా ప్రజల ప్రయోజనాల కోసం పని చేయాలన్నారు.

సంక్షేమం ఓటర్లను ప్రభావితం చేసింది

మీడియాతో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

ప్రజాశక్తి - తెనాలి

ఐదేళ్ల పాలనలో వైసిపి అందించిన సంక్షేమం ప్రజలను పూర్తిగా చైతన్యవంతం చేసిందని ఫలితంగానే ఓటర్ స్పందన అనూహ్యంగా ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక లెక్చరర్స్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ సారధ్యంలో ప్రజలు అన్ని విధాల లబ్ధి పొందాలని, తిరిగి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని మనసారా కోరుకుంటున్నారన్నారు. వెల్లువెత్తిన ఓటర్ల చైతన్యమే



అందుకు నిదర్శనమన్నారు. వాతావరణ పరిస్థితులు భిన్నంగా ఉన్నప్పటికీ రాత్రి 10 గంటల వరకు బార్లు తీరి ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్క ఓటరుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల తీర్పు స్పష్టంగా ఉంటుందని, తాను నియోజకవర్గంలో అందించిన సంక్షేమం ఎంతో పారదర్శకంగా ఉందన్నారు. ఎన్నికలకు రెండు నెలలు ముందు వచ్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చెల్లవన్నారు. పోలింగ్ రోజున తాను ఓటు వేసే క్రమంలో జరిగిన దాడి ప్రతిదాడిపై ఆయన స్పందిస్తూ, ఘటన వ్యూహాత్మకంగా, కుట్ర పూరితంగా జరిగిందని, ఘటన వెనుక దాగిన కుట్రను వెలికి తీస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలు కూడా త్వరలోనే కుట్ర బాగోతం తెలుసుకుంటారన్నారు. ఘటనపై రకరకాలుగా స్పందించిన మనోహర్ ను కూడా క్యూలో ఉండే ఓటు వేశారా అంటూ ప్రశ్నించారు. సంక్షేమానికి ప్రజలు పట్టం కడతారని, జూన్ 4 తర్వాత అంతా స్పష్టమవుతుందన్నారు.

ఓటమి భయంతోనే టిడిపి దాడులు

ఎన్నికల కమిషన్ మద్దతు కోసమే బిజెపితో పొత్తు

పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో మరోసారి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందనే అక్కసుతోనే పల్నాడు జిల్లాలో టిడిపి దాడులకు తెగబడిందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో ఆయనమాట్లాడారు. టిడిపి వారు పెదకూరపాడు నియోజకవర్గంలో దాడులకు తెగబడటం ద్వారా ఫ్యాక్షన్ రాజకీయాలను



టిడిపి వారి దాష్టికాల వీడియోను చూపుతున్న ఎమ్మెల్యే శంకరరావు

తెరపైకి తెచ్చారన్నారు. ప్రజలు సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉండేందుకు భారీగాపోలింగ్‌కు తరలి వచ్చారని తెలిసింది. తమ నియోజకవర్గంలో 89 శాతంపోలింగ్ జరిగినట్లు ఆయన తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్‌శాతం బాగా పెరిగిందన్నారు. వైసిపి గెలుస్తుందనే అసూయతోనే టిడిపి అనేక గ్రామాల్లో దాడులకుపాల్పడినట్టు తెలిపారు. వైసిపికి ఆధిపత్యం ఉన్నగ్రామాల్లోనే ఎక్కువ ఘర్షణలకు పురిగొల్పారని ధ్వజమెత్తారు. అచ్చంపేట, కొత్తపల్లి, వేల్పూరు, దొడ్లేరు, కంభంపాడు, హుస్సేన్ నగరం, ఎర్రబాలెం, చింతపల్లి గ్రామాల్లో దళితులపై టిడిపి వారు దాడులు చేశారని అన్నారు. కంభంపాడులో సర్పంచ్ పై హత్యాయత్నం చేశారని, కొన్ని గ్రామాల్లో ఎస్సీలను నీళ్ల కూడా పట్టుకోనివ్వడం లేదన్నారు. దొడ్లేరులో వైసిపి నాయకులను రోడ్లపై పడేసి కొట్టారని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ వ్యవస్థ సరిగా పనిచేయలేదన్నారు. కేవలం హెూంగార్డులతో భద్రత కల్పించారని తెలిపారు. ఎన్నికల్లో దౌర్జన్య కాండ చేసేందుకే టిడిపి బిజెపితో పొత్తు పెట్టుకుందన్నారు. అయినా ప్రజలు ఎదురు నిలిచారు.. అందుకే ఎన్నడూ లేని విధంగా 89 శాతం పోలింగ్ జరిగిందన్నారు. దాడులపై ఆధారాలతో పోలీసులకు, ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరపడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. టిడిపి ఎన్ని కుట్రలు చేసినా తాను 25 వేల ఆధిక్యతతో గెలుస్తానని జోస్యం చెప్పారు.

జనచైతన్య గ్రూప్స్ డైరెక్టర్ మాదల శకుంతల అస్తమయం

పలువురు ప్రముఖులు ఘననివాళి - స్థంబాలగరువు మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి-గుంటూరు



మాదల శకుంతల (ఫైల్‌ఫోటో)

జనచైతన్య గ్రూపు సంస్థల డైరెక్టర్, వ్యవస్థాపకురాలు మాదల శకుంతల(86) సోమవారం గుంటూరులోని రాజేంద్ర నగర్‌లో ఆమె నివాసంలో మరణించారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు మాదల రత్నగిరి బాబు, మాదల సుధాకర్ ఉన్నారు. జనచైతన్య గ్రూపు సంస్థలను స్థాపించటం లోనూ, అభివృద్ధి చేయటంలో ఆమె ఎంతో కీలక భూమిక పోషించారు. శంకర కంటి ఆసుపత్రికి కోట్లాది రూపాయల విలువైన 5 ఎకరాల భూమిని కంచి కామకోటి ట్రస్టుకు విరాళంగా ఇచ్చారు. గుంటూరులో మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కళాశాలను నిర్మించి నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీకి అప్పగించారు. సాయి భాస్కర్ ఆసుపత్రి నిర్మించారు. శ్రేష్టా ఇన్‌ఫ్రా, శకుంతల ఫైనాన్షియర్స్ సంస్థలను స్థాపిం చారు. కంచికామకోటి పీఠం నిర్వహిస్తున్న వేద కళాశాలకు ఐదు ఎకరాల స్థలం విరాళంగా ఇచ్చారు. మంగళవారం శకుంతల భౌతిక



స్థంబాలగరువు మహాప్రస్థానానికి తరలిస్తున్న శంకుంతల భౌతిక ఖాయం

ఖాయాన్ని టిడిపి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, గుంటూరు పశ్చిమ టిడిపి అభ్యర్థి గల్లా మాదవి, ఎమ్మెల్యే ముస్తఫా, మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పలువురు ప్రముఖులు పాల్గొని నివాళి అర్పించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రత్నగిరిబాబు మాట్లాడుతూ మా తల్లి ఎంతో కష్టపడి మమ్మల్ని పెంచి పెద్దచేశారని, జనచైతన్య గ్రూపు సంస్థలను ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. జనచైతన్య గ్రూపు సంస్థల చైర్మన్ మాదల సుధాకర్ మాట్లాడుతూ ఆమె ఆదేశానుసారం అనేక సంస్థలకు ఆర్థిక సాయం అందించామని, భవిష్యత్‌లో ఆమె ఆశయాన్ని, ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళతామన్నారు. అనంతరం స్థంబాల గరువులోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మంగళగిరి నియోజకవర్గంలో 85.74 శాతం పోలింగ్

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి అసెంబ్లీ నియోజవర్గంలో 85.74% ఓట్లు పోలైనట్లుగా మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి మంగళవారం తెలిపారు. 2,92, 432 ఓట్లు గాను 2,50,742 ఓట్లు పోలైనట్లుగా తెలిపారు. అందులో పురుషులు 1,21,038 ఓట్లు, మహిళలు 1,29,697 ఓట్లు, ఇతరులు ఏడుగురు ఓటు హక్కు వినియోగించుకున్నట్లుగా తెలిపారు. సోమవారం రాత్రి 12 గంటల వరకు పోలింగ్ జరిగింది.

రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా అమర్లపూడి నియమాకం

ప్రజాశక్తి - మంగళగిరి



బుల్లా రాజారావు నుండి నియామక పత్రాన్ని అందుకుంటున్న అమర్లపూడి

మంగళగిరి అంబేద్కర్ సెంటర్లోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నూతనంగా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా విజయవాడకు చెందిన అమర్లపూడి ఏహేస్కేలు ను నియమిస్తూ ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు మంగళవారం ఏహేస్కేలు కు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం బుల్లా మాట్లాడుతూ అమర్లపూడి ఎస్సీ ఎస్టీ ప్రజల హక్కుల పరిరక్షణకు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు, న్యాయపరమైన సలహాలు అందించే విధంగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.



సరుకులు అందజేస్తున్న సత్యనారాయణ, విజయ్‌చందు

మాతృశ్రీ ఆశ్రమంలో నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

లయన్స్ 316-హెచ్ జిల్లా మాజీ గవర్నర్ లయన్ జె.పి.వెంకటేశ్వర్లు మూడవ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టాభిపురంలోని రవీంద్రనగర్‌లోని మాతశ్రీ పిల్లల ఆశ్రమానికి 50 కేజీలు బియ్యం, కందిపప్పు, నూనె 15 రకాల మొత్తం నిత్యావసర సరుకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జె.పి.వెంకటేశ్వర్లు బంధువులు సత్యనారాయణ, లయన్స్ మాజీ గవర్నర్ కె.విజయ్‌చందు తదితరులు పాల్గొన్నారు



భగీరథ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సగరులు

ఘనంగా భగీరథ జయంతి వేడుకలు

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి భగీరథ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ సగరుల మూలపురుషుడు భగీరథుడన్నారు. భగీరథుడు దివి నుంచి భూమికి గంగను తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కర్నాటి శివ సత్యనారాయణ, జూట్రు ఏడుకొండలు, కటారి విష్ణుమూర్తి, గండికోట వీర రాఘవులు, అచ్చయ్య, దుంపల సోములు, రెడ్డి సుబ్బారావు, వీర రాఘవ తదితరులు పాల్గొన్నారు.



ఘర్షణల్లో క్షతగాత్రులకు అభ్యర్థుల పరామర్శ

ప్రజాశక్తి - వినుకొండ

ఎన్నికల సందర్భంగా టిడిపి-వైసిపి ఘర్షణల్లో గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి కార్యకర్తలను ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు మంగళవారం పరామర్శించారు. టిడిపి నాయకులే గ్రామాల్లో గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి పైసాచిక ఆనందం పొందుతున్న ఆ పార్టీకి వారికి చట్ట ప్రకారం బుద్ధి చెబుతామన్నారు. క్షతగాత్రులకు అండగా ఉంటామని చెప్పారు. ఘర్షణలు జరక్కుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.



ప్రజాశక్తి - వినుకొండ

ఎన్నికలు సందర్భంగా పల్నాడు ప్రాంతంలో దాడుల వెనకున్న వైసిపి ఆరాచక శక్తుల్ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎన్‌డిఎ కూటమి తరుపున టిడిపి నరసరావుపే ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, వినుకొండ, మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థులు జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు డిమాండ్ చేశారు. ఘర్షణల్లో గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న టిడిపికి కార్యకర్తలను వారు మంగళవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నూజెండ్లలో పోలింగ్ అయిపోయాక ప్రశాంతంగా ఊళ్లో వైసిపి దుండగులు దాడులు చేశారని, టిడిపి కార్యకర్తను చంపడానికి యత్నించారని అన్నారు. ఆదివారం నూజండ్ల మండలం పాత చెరువు కొమ్ముపాలెం, రెడ్డికొత్తూరులో వైసిపి దాడిలో జెడ్‌పిటిసి సుబ్బులు భర్త జడ్డ రామయ్యతో పాటు పలువురుకి గాయాలైనట్లు చెప్పారు. వినుకొండలో దాడులను వైసిపి అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడే ప్రోత్సహించారని ధ్వజమెత్తారు. త్రిపురాపురం, జంగాలపల్లి, కొత్తనాగిరెడ్డిపల్లి, ఉప్పలపాడు, కొచ్చెర్లలో దాడులు చేశారన్నారు. గుట్లపల్లి ఎస్సీ కాలనీలో మొత్తం అందర్నీ వెంటపడి కొట్టారని అన్నారు. జిల్లాలోని అన్నిచోట్ల దాడులపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేయాలని, బొల్లా బ్రహ్మనాయుడు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి లాంటి వాళ్లను జైల్లో పెట్టాలని కోరారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

టిడిపి శ్రేణులపై దాడులకు పాల్పడిన వైసిపి శ్రేణులపై చర్యలు తీసుకోవాలని ఎన్‌డిఎ కూటమి తరుపున సత్తెనపల్లి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. నకరికల్లు, ముప్పాళ్ల మండలాల్లో గొడవలు జరిగి తీవ్రంగా గాయపడి నర్సరావుపేట ఆసుపత్రిల్లో చికిత్స పొందుతున్న వారిని లక్ష్మీనారాయణ మంగళవారం పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆయనవెంట నాయకులు నాగౌతు శౌరయ్య ఉన్నారు.







పల్నాట ఆరని మంటలు

- కారంపూడిలో టిడిపి-వైసిపి ఘర్షణ - వాహనాల దహనం
- రంగంలోకి దిగిన ఎస్పీ - బలగాల మోహరింపు

ప్రజాశక్తి - కారంపూడి

ఎన్నికల పోలింగ్ అనంతరమూ పల్నాడులో ప్రశాంతత కరువుగానే మారింది. మండల కేంద్రమైన కారంపూడిలో మంగళవారం వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య ఘర్షణ తలెత్తి మూడు గంటల పాటు భయానక వాతావరణం నెలకొంది. ఇరుపక్షాలు పరస్పరం రాళ్లు రువ్వుకోండంతోపాటు కార్యాలయాలనూ ధ్వంసం చేసుకున్నాయి. కర్రలు, రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఘర్షణను నివారించే క్రమంలో సిఐ తలకు సైతం గాయాలయ్యాయి.

ఓ పార్టీకి చెందిన వారి ఇంటిని మరోపార్టీకి చెందిన వారు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. దీంతో భాధితుణ్ణి పరామర్శించేందుకు నాయకుడు వస్తున్నాడని తెలిసి ఆ పార్టీకి చెందిన వందమంది వరకు స్థానిక కారంపూడి-మాచర్ల ప్రధాన రహదారిలోని మంగళవారం సుమారు మధ్యాహ్నం 3 గంటలప్పుడు నిలబడ్డారు. అదేసమంలో అటుగా వచ్చిన 20 మంది ప్రత్యర్థి పార్టీ వారు తమ పార్టీ, నాయకునికి జై కొడుతూ జనంలోకి వెళ్లారు. దీంతో ఆగ్రహానికి గురైన అక్కడున్నవారు వీరిపై దాడి చేశారు. అక్కడిని వెళ్లిన ఒక పార్టీ వారు తర్వాత మరింతమందిని సమీకరించుకుని అదే ప్రదేశానికి వచ్చారు. దీంతో ఘర్షణ ముదిరింది. ఇరుపక్షాలు పరస్పరం రాళ్లు రువ్వుకున్నాయి. ఆయా పార్టీల శ్రేణులు పరస్పరం తమ కార్యాలయాలను ధ్వంసం చేసుకున్నారు. దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ కారు, వైఎస్ఆర్సిపి బీసీ నాయకుడికి సంబంధించిన ద్విచక్ర వాహనాలను దహనం చేసుకున్నారు. ఘర్షణ నేపథ్యంలో ఇరు పార్టీలకు చెందిన వారు కర్రలు, రాడ్లు పట్టుకుని ప్రధాన వీధుల్లో పరుగెత్తడం, రాళ్లు రువ్వుకోవడంతో స్థానికంగా రెండుమూడు గంటలపాటు భీకరంగా పరిస్థితి తయారైంది. పలువురు భయంతో ఇళ్ల తలుపులేసుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. సమాచారం అందుకున్న పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ కారంపూడికి చేరుకున్నారు. మూడు గంటలకుపైగా ఇక్కడే ఉండి పరిస్థితిని సమీక్షించారు. ప్రత్యేక బలగాలతో పికెటింగ్ ఏర్పాటు చేశారు. మరోవైపు పరామర్శకని వచ్చిన నాయకుణ్ణి పోలీసులు ముందుగానే ఆపి పరిస్థితిని వివరించి వెనక్కు పంపారు.

కలెక్టర్, ఎస్పీ ఉన్నా వైసిపి దాడులు

- ఆ పార్టీకే కొమ్ముకాసిన పోలీసులు - పోలింగ్ తగ్గించేందుకు యత్నం
- టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని వైసిపి నాయకులకు సూచించిన నేపథ్యంలోనే పల్నాడు జిల్లాలో ఓటమిని జీర్ణించుకోలేక వైసిపి నేతలు దాడులకు పాల్పడ్డారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. విజ్ఞులైన ప్రజలు సరైన తీర్పు ఇస్తారని చెప్పారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఎన్‌డిఎ కూటమి తరుపున పార్లమెంట్, అసెంబ్లీ నియోజవకర్గ టిడిపి అభ్యర్థులతో కలిసి మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో టిడిపి శ్రేణులపై దాడికి పాల్పడిన వైసిపి శ్రేణులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలింగ్ శాతం చూసిన వైసిపి దాన్ని తగ్గించడానికి వివాదాలు సృష్టించారని ఆరోపించారు. దాడులు జరిగిన పోలింగ్ కేంద్రాల వద్ద రీ పోలింగ్ జరపాలని డిమాండ్ చేశారు. వైసిపికి అనుకూలంగా జిల్లా ఎస్పీ, ఎన్నికల యంత్రాంగం మొత్తం వ్యవహరించిందని ఆరోపించారు.

ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పల్నాడులో ప్రజాస్వామ్యం లేదనే విషయం సోమవారం తేలిపోయిందన్నారు. వైసిపికి తొత్తుగా పోలీస్ వ్యవస్థ మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసరావుపేట మండలంలోని దొండపాడులో పోలీసులు, సబ్ కలెక్టర్ ముందే తన కాన్వాయ్‌పై దాడి చేశారని, పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద వైసిపి నేతలకు అనుకూలంగా పని చేశారని అన్నారు. నరసరావుపేటలో వైసిపి శ్రేణులు నడిరోడ్డులో చదలవాడ అరవిందబాబుపై దాడి చేసి కార్లను ధ్వంసం చేశారన్నారు. పోలీసులు, అధికారులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటించారు. పల్నాడు జిల్లాలో 85.69 శాతం ఓటర్లు తమ హక్కును వినియోగించుకోవడం హర్షణీయమన్నారు.

చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ పోలింగ్ శాతం నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాల్లో వైసిపి నేతలు పథకం ప్రకారం పోలింగ్ బూత్ వద్ద రాళ్ల కుప్పలు, కర్రలు పెట్టుకున్నారని అన్నారు. ఈవీఎంలను బద్దలు కొట్టడానికి వైసిపి శ్రేణులు పూనుకున్నాయని విమర్శించారు.

మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఎస్పీ, కలెక్టర్ ఇద్దరూ ఉన్నా ఎక్కడా దాడులు ఆగలేదని, వైసిపి నేతలకు పోలీసులు కొమ్ము కాశారని విమర్శించారు. రెంటచింతల మండలం రెంటాలలో టిడిపి ఏజెంట్లను పోలింగ్ కేంద్రం నుండి ఉదయం 7 గంటలకు బయటకు నెట్టేశారని, దీనిపై ఫోన్‌లో ఫిర్యాదు చేస్తే పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. వైసిపి శ్రేణులు తన కళ్లల్లో కారం కొట్టి దాడి చేశారని, టిడిపి కార్యకర్తలపై ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తమ్ముడు వెంకట రామిరెడ్డి కారుతో ఢీ కొట్టి అనంతరం దాడి చేశారని చెప్పారు. వైసిపి నేతల వాహనాలలో ఇప్పటికీ రాడ్లు, కర్రలు ఇతర మారణాయుధాలు పెట్టుకుని తిరుగుతున్నారన్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రోద్బలం తోనే రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద వైసిపి నేతలు రాళ్లు సిద్ధం చేశారని, వైసిపి నేతల అరాచకాలకు ఎదురు నిలబడి టిడిపి శ్రేణులు పోలింగ్ సజావుగా సాగేలా చూశారన్నారు. సమావేశంలో వినుకొండ, నరసరావుపేట, పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థులు జీవీ ఆంజనేయులు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నాయకులు జి.జనార్దన్ బాబు, చల్లా సుబ్బారావు, రఫీ, కె.నాగ సుధీర్, టి.నరసింహారావు పాల్గొన్నారు.

ఏజెంట్లపై కూటమి కార్యకర్తల దాడి : మనోహర్ నాయుడు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మండల పరిధిలోని కావూరు ఎస్సీ కాలనీ పోలింగ్ కేంద్రం వద్ద ఏజెంటుపై ఎన్‌డిఎ కూటమి నేతలు దాడులు చేశారని వైసిపి చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. క్షతగాత్రులను మంగళవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఘర్షణపై వివరాలను బాధితులు ఆయనకు చెప్పారు. పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభం కావడంతో సాయంత్రం ముగింపు సమయాన్ని కొంత పెంచాలని కోరామని, ఇందుకు టిడిపి వారు గొడవపెట్టుకుని కులం పేరుతో దూషించారని, దాడి చేశారని చెప్పారు. వైసిపి ఏజెంట్ నలమాల కాంతయ్య, కట్టెం ఆనందరావుకు తీవ్రంగా గాయాలయ్యాయని, మరికొందరికి కనిపించని దెబ్బలు తగిలాయని చెప్పారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం వచ్చిన తాము మంగళవారం వాటర్‌ప్లాంట్ వద్దకు తాగునీటి కోసం వెళితే రావద్దంటూ ఆంక్షలు విధించారని అన్నారు. దీనిపై మనోహర్‌నాయుడు మాట్లాడుతూ కాలనీ వాసులకు తాగునీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారంగా కాలనీలోని లూథరన్ చర్చి వద్దనే వాటర్ ప్లాంట్‌ను తన సొంత నిధులు రూ.6 లక్షలతో నిర్మిస్తానని చెప్పారు.



అప్పటి వరకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కె.అనిల్, డి.శంకర్, చినబాబు, జి.యామలయ్య, కె.మస్తాన్‌రావు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాం : ఎస్పి తుషార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లాతో పోలిస్తే గుంటూరు జిల్లాలో స్వల్ప ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎన్నికల నిర్వహణ తీరులో పోలీసు సిబ్బంది, అధికారులు సమర్ధవంతంగా పనిచేశారని జిల్లా ఎస్పి తుషార్ డూడి తెలిపారు. గత కొన్ని రోజులుగా ముందస్తు పక్కా ప్రణాళికతో ఎన్నికల నిర్వహణను సమర్ధవంతంగా నిర్వహించామన్నారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా, జిల్లాలో ఎక్కడా రిపోలింగ్ లేకుండా పోలింగ్ నిర్వహించ గలిగామని తెలిపారు. ఎన్నికల విధి నిర్వహణలో తనకు పూర్తిగా సహాయ సహకారాలు అందించి ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసినందుకుగాను జిల్లా పోలీసు అధికారులకు మరియు సిబ్బందికి ఆయన దన్యవాదాలు తెలిపారు. జిల్లాలో అక్కడక్కడ చెదురు మదురు సంఘటనలు మినహా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల విధులు నిర్వహించడంలో పోలీసు యంత్రాంగానికి జిల్లా ప్రజలు మీడియా ప్రతినిధులు సహాయ సహకారాలు అందించారని తెలిపారు.

పోలింగ్ సరళిపై అంచనాల్లో ప్రధాన పార్టీలు

ప్రజాశక్తి-తెనాలి

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపద్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు పోలింగ్ సరళిపై దృష్టిసారించారు. ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకూ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పోలింగ్ జరిగిన తీరును, ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్న విధానంపై అంచనాల్లో తలమునకలయ్యారు. బూత్ ఏజంట్లతో పాటు, పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులతో సమీక్షిస్తున్నారు. నియోజకవర్గంలో దాదాపుగా 2.62లక్షల మంది ఓటర్లున్నారు. పట్టణంతో పాటు కొల్లిపర, తెనాలి రూరల్‌లో మొత్తం 273 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. గతం కంటే భిన్నంగా ఉదయం ఏడు గంటలకే ఓటర్లు పోలింగ్ బూత్‌లవద్ద స్వచ్ఛంగా క్యూ కట్టడం, గంటగంటకూ ఆ రద్దీ మరింత పెరగటం, ముఖ్యంగా పురుషులకు దీటుగా మహిళలు, వృద్దులు, వికలాంగులు, యువకులు పెద్ద ఎత్తున పోలింగ్ ప్రక్రియలో పాల్గొనటం చర్చనీయాంశమైంది. కొన్ని పోలింగ్ స్టేషన్లలో మాక్ పోలింగ్ జాప్యం, ఈవిఎంల మొరాయింపు వంటి ఘటనలతో అర్ధగంట నుంచి గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైన సందర్భాలు కూడా ఉన్నాయి. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఆరు గంటలకు ముగించాల్సి ఉంది. అయితే పోలింగ్ సమయం ముగిసిన తరువాత కూడా ఓటర్లు పెద్ద ఎత్తున క్యూలో ఉన్నారు. దాదాపు 20కి పైగా పోలింగ్ స్టేషన్లలో రాత్రి పది గంటల వరకూ కూడా పోలింగ్ జరిగింది. గతంలో ఇలాంటి పరిస్థితి నియోజకవర్గం మొత్తం మీద నాలుగైదు పోలింగ్ బూత్‌లలో కనిపించేది. పోలింగ్ ముగింపు సమయానికి అదనంగా గంట, గంటన్నరకు మించి పోలింగ్ జరిగేది కాదు. కాని తెనాలి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విదంగా పోలింగ్ సమయానికి అదనంగా నాలుగు గంటలు సమయం పట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వాస్తవానికి నిర్ణీత పోలింగ్ సమయం ముగిసేసరికి 65.69 శాతం పోలింగ్ నమోదు కాగా, ఓటింగ్‌కు అదనంగా తీసుకున్న సమయంతో పోలింగ్ ముగిసేసరికి 76.16శాతం నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రఖర్ జైన్ తెలిపారు. అంటే దాదాపు 11శాతం వ్యత్యాసం ఉంది. పెరిగిన ఓటింగ్ శాతం అధికార పార్టీకి వ్యతిరేకమని కొందరు, చివరి గడియల్లో వైసిపికి అనుకూలంగా ఓటింగ్ సరళి ఉందని మరికొందరు అంటున్నారు. ప్రధాన పార్టీలైన కూటమి, వైసిపి అభ్యర్థుల్లో ఎవరు గెలిచినా స్వల్ప ఆధిక్యమే ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. ఇదిలా ఉంటే నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి కారుమంచి సునీల్ సందీప్, సిపిఎం,సిపిఐ, కాంగ్రెస్ మద్దతు తెలిపిన సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ


తెనాలిలో బారులు తీరిన ఓటర్లు

అభ్యర్థి శావల గోపాల్ ద్వారా కొంత ఓట్ల చీలిక ఉంటుందని, ప్రధాన పార్టీలపై ఓట్ల చీలిక ప్రభావం ఖచ్చింతంగా ఉంటుందన్న చర్చ సాగుతోంది.

సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మద్యే ప్రధానంగా పోటీ నెలకొంది. గతంలో అంటే 2014, 2019 ఫలితాలను పరిశీలిస్తే టడిపి, వైసిపిల మద్య జరిగిన పోటీలో 17 నుంచి 19వేల మద్యే మెజారిటీ నమోదైంది. 2014లో అన్నాబత్తుని శివకుమార్‌పై గెలుపొందిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ 19వేల మెజారిటీ సాధించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ 15,521 ఓట్లు, బిఎస్పీ 3,254 ఓట్లు సాధించారు. 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి అన్నాబత్తుని శివకుమర్ 17,652 ఓట్ల మెజారిటీతో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై గెలుపొందారు. ఆ ఎన్నికల్లో జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ 29వేల పైచిలుకు ఓట్లు సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూడా జతకట్టడం, గత ఎన్నికల్లో జనసేన తరపుర పోటీచేసి 29వేలకు పైగా ఓట్లను చీల్చిన నాదెండ్ల మనోహర్, ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేయటం, బిఎస్పీ విస్తృత ప్రచారం, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ మద్దతుతో సిపిఐ(ఎంఎల్)అభ్యర్థి పోటీలో ఉండటం ఈ ఎన్నికల్లో ప్రధాన అంశాలుగా చెప్పొచ్చు. వీటన్నింటిని మించి పోలింగ్ ప్రారంభంలోనే వైసిపి అభ్యర్థి ఓటరుపై చెయ్యిచేసుకోవటం, ఓటరు తిరగబడటం వంటి ప్రత్యేక పరిస్థితుల్లో ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠత నెలకొంది.

కృష్ణబాబు కాలనీలో యువకుల ఘర్షణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కృష్ణబాబు కాలనీలో మంగళవారం ఇరు వర్గాలమధ్య ఘర్షణ జరిగింది. దాదాపు 30 మంది యువకులు బాహాబాహికి పాల్పడ్డారు. ఆరుగురు


జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకులు

వ్యక్తులకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగంలో ఘర్షణకు దిగిన మూకలపై అధికారులు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రాగానే నిందితులంతా పరారయ్యారు. గాయపడిన వారిలో షేక్ మున్నా అనే యువకుడి పరిస్థితి విషమంగాఉంది. పట్టాభిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొండపావులూరు-బిబిగూడెం రోడ్డు ధ్వంసం

- రైతులు, ప్రయాణీలకులకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి - గన్నవరం

మండలంలో కొండపావులూరు నుంచి బిబిగూడెం గ్రామాల్లోని పొలాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసం అయ్యింది. ప్రయాణికులు, రైతులు కాలు మోపలేని పరిస్థితి తలెత్తింది. ద్విచక్ర వాహన చోదకులు ఆదమరిస్తే ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. రాత్రిళ్లు ఈ రోడ్డుపై ప్ర యాణం నరకాన్ని చూపిస్తోంది. దాదాపు దశాబ్దం క్రితం జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఈరహదారి ని అభివద్ధి పరిచారు. ఐదేళ్లకు రోడ్డు పాక్షికంగా దెబ్బతింది. ఆ తర్వాత ఐదేళ్ల పారెడు మట్టి కూడా వేయలేదు. వానలకు మొత్తం లేచిపోయి గోతులు మిగిలాయి. లారీలు, బస్సులు, ట్రాక్టర్ల తాకిడికి అవి రాళ్లతేలి పెద్దవిగా మారాయి. దీంతో ఈ రహ దారిపై ప్రయాణం ప్రమాదకంగా మారింది.

రైతుల బాధలు వర్ణాతీతం..

కొండపావులూరు, పురుషోత్తపట్నం నుంచి బిబిగూడెం వరకు పది కిలోమీటర్ల దూరం ఉంది. ర హదారికి ఇరువైపులా పంట పొలాలున్నాయి. దాదాపు రెండు వేల ఎకరాలలో వరి సాగు అవుత ంది. నిత్యం రైతులు పొలాలకు వెళ్తారు. రోడ్డంతా గోతులు పడటంతో నడవటానికి అగచాట్లు ప డుతున్నారు. ద్విచక్ర వాహనం పై వెళితే ఎక్కడ పడిపోతామో అన్న భయం వారిలో నెలకొంది. దీంతో చాలా మంది కష్టమైనా నడచి వెళ్తున్నారు. ఈ రహదారికి మోక్షం లేదని మదన పడు తు న్నారు. వ్యవసాయ ఉత్పత్తులు తీసుకెళ్లడానికి


గోతులు పడిన రోడ్డు

లారీలు రావటం లేదు. అందుకు కారణం రోడ్డం తా ద్వంశం కావటమే. గత పదేళ్లలో ఈరహదారిని బాగు చేయించాలని కోరుతూ స్థానికులు అధికారులకు ఎన్నిసార్లు నివేదించారు. అయి నా రహదారికి ఒక్క రూపాయి కూడా నిధులు మం జూరు కాలేదు. పురుషోత్తపట్నం, కొండపావులూరు, బిబిగూడెం రైతుల గోష ఎవరికీ వినపడటం లేదు. ఇప్పటికైనా స్పందించి నిధులు మంజూరు చేయించాలని అంటున్నారు.


విద్యార్థినికి స్వాగతం పలుకుతున్న కళాశాల సెక్రటరీ శ్రీనివాసు, ప్రిన్సిపాల్ నారాయణరావు తదితరులు

పవర్ లిఫ్టింగ్‌లో కెబిఎన్ విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి- విజయవాడ వన్‌టౌన్

ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వన్‌టౌన్ కొత్తపేటలో గల కాకరపర్తి భావనారాయణ కళాశాల విద్యార్థి పీ. భరత్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల తొమ్మిదో తేదీన చైనాలోని హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న భరత్‌కుమార్ తమ కళాశాల కీర్తిని, దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసే రీతిలో తన ప్రతిభను ప్రదర్శించి బంగారు పతకాన్ని సాధించినట్లు ఆయన తెఇపారు. చైనాలో జరిగిన పోటీల్లో పాల్గొని నగరానికి వచ్చిన భరత్‌కుమార్‌కు మంగళవారం రైల్వే స్టేషన్ వద్ద కళాశాల యాజమాన్యం, విద్యార్థులు భారీ సంఖ్యలో ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి కళాశాల విద్యార్థులు భారీ ప్రదర్శనగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కళాశాలకు వచ్చిన పీ భరత్‌కుమార్‌కు కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావులు సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ భరత్‌కుమార్ కళాశాల కీర్తిని, రాష్ట్ర, దేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటే విధంగా తన ప్రతిభను చాటాడన్నారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌ను, తీర్చిదిద్దిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్రరావులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో కాయ్‌రాజాకాయ్

అభ్యర్థుల గెలుపుపై పందేల జోరు

ప్రజాశక్తి-తాడేపల్లి

సోమవారం ఎన్నికలు ముగిశాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఇక పందేల మీద దృష్టి పెట్టారు. తమ పార్టీ గెలుస్తుందంటే తమ పార్టీ గెలుస్తుందంటూ కాయ్‌రాజకాయ్ అంటూ ఎంతకైనా పందేలు వేస్తున్నారు. ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీలో ఉన్న అభ్యర్థి గెలుస్తాడని తాడేపల్లి పట్టణంతో పాటు మండలంలో కోట్ల రూపాయలు బెట్టింగ్ కోసం సిద్ధంగా ఉన్నాయి. కాదు తమ అభ్యర్థే గెలుస్తాడంటూ అధికార పార్టీకి చెందిన వారు కూడా పందేలు వేస్తున్నారు. లక్షల రూపాయల నుంచి కోట్ల రూపాయల వరకు ఈ పందేల జోరు కనపడుతుంది. కొంతమంది తమకున్న స్థిరాస్తులను కూడా పందేల కోసం అడుగుతున్నారంటే ఎన్నికల జ్వరం ఎంతగా పట్టుకుందో అర్థమవుతుంది. మంగళగిరి నియోజకవర్గంలో 40 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఓటింగ్ సరళిని బట్టి ప్రధానంగా వైసిపి, టిడిపి రెండు పార్టీల మధ్యే పోలింగ్ వార్ జరిగినట్లు తెలుస్తుంది. పందేల్లో కూడా ఈ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలే అత్యధికంగా ముందుకు వస్తున్నారు. బైపాస్ పుణ్యమాని కోట్లక పడగలెత్తిన ఇరుపార్టీల నాయకులు పందేలకు సై అంటున్నారు. నువ్వానేనా అన్నట్లు సాగిన ఈ పోలింగ్‌లో గెలుపు ఎవరిని వరిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఏపీ పీ సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 20 24 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకునే తేదీలను పొడిగించినట్లు పీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి. జాన్సన్ తెలిపారు. అభ్యర్థులు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31వ తేదీ వరకు తమ దరఖాస్తులు సమర్పించుకోవచ్చునని తెలిపారు. 500 రూపాయల అపరాధ%శీ%తో జూన్ 7 వరకు, రూ .1000 అపరాధంతో జూన్ 14 వరకు తేదీలను ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. దేహదారుఢ్య పరీక్షలు జూన్ 25 నుంచి విశ్వవిద్యాలయంలోని క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పీ సెట్ కు మారిన తేదీలను పీసెట్ వెబ్సైట్ నుంచి పొందవచ్చునని సూచించారు. అలాగే పి సెట్ దరఖాస్తులకు సంబంధించి ఏదైనా సందేహాలు ఉంటే 0863-2346218 నంబర్ ను సంప్రదించాలని జాన్సన్ తెలిపారు.

21 నుండి ఐఏఎస్ ఫౌండేషన్ క్లాసులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక రామన్నపేట 1వ లైనులోని జనచైతన్య వేదిక కార్యాలయంలో మే 21 నుండి పది రోజులపాటు ఐఏఎస్ ఫౌండేషన్ క్లాసులు ఉచితంగా నిర్వహిస్తామని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్(సన్) కన్వీనర్ కె.సాయికుమార్ తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తామన్నారు. పాఠశాల విద్యార్థులు హాజరు కావచ్చని తెలిపారు. ఇతర వివరాలు, పేర్లు రిజిస్ట్రేషన్ కోసం 72075 66702, 63094 81514, 86888 97406 నంబర్లలో సంప్రదించాలని కోరారు. నిపుణులు ఉన్నత అధికారులు క్లాసులు తీసుకుంటారన్నారు.

చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సిబిఎస్ఈ సిలబస్‌పై

19న ఓరియెంటేషన్ తరగతులు

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో 10వ తరగతి సిబిఎస్ఈ సిలబస్‌కు సంబంధించిన బయాలజీ, ఇంగ్లీషు, ఫిజికల్‌సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులపై మే19 తేదీ ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకూ ఓరియెంటేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈ ఓరియెంటేషన్ కార్యక్రమానికి ఇప్పటికే దాదాపు 200 మంది పైగా ఉపాధ్యాయులు తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్నారని, వారందరూ మే 19న 9:30లకు చలపతి ఇంజనీరింగ్ కళాశాలకు రావాలని కోరారు. ఇంకా రిజిస్టర్ చేసుకోని ఉపాధ్యాయులు వెంటనే తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని లైట్‌మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు హెవీ మోటారు వెహికిల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్ ప్రారంభించినట్లు ఆర్టీసి గుంటూరు-2 డిపో మేనేజర్ యస్‌కె.అబ్దుల్ సలామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కూల్‌ల ఇప్పటి వరకూ 14బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వటం జరిగిందని, ప్రస్తుతం 15వ బ్యాచ్‌కు అడ్మిషన్లు ప్రారంభించినట్లు చెప్పారు. కేవలం 16 సీట్లు మాత్రమే ఉంటాయని, కావున ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణలో ప్రతిరోజు ఒక గంట వాహనం యొక్క వివిధ భాగాలు, వాటి పనితీరు, వివిధ రకాల రోడ్లు, రోడ్లపైన ఉండే పెయింటింగ్ మార్కులు, రోడ్ల ప్రక్కన ఉండే సైన్ బోర్డులు, రోడ్ల ప్రక్కన ఉండే సిగ్నల్ బోర్డుల గురించి సవివరంగా తెలియేస్తారని అన్నారు. అలాగే ప్రతిరోజు ప్రాక్టికల్‌గా ప్రతి ఒక్కరితో పదిహేను కిలోమీటర్లు బస్సును నడిపిస్తారని, వీడియో విజువల్స్ ద్వారా ప్రమాదాలు జరిగే తీరు చూయించి వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తారన్నారు. గ్యారేజీలో సుదీర్ఘ అనుభవం ఉన్న మెకానిక్‌లు వాహనం విడిభాగాలు అన్ని చూపిస్తూ, వాటి పనితీరు గురించి తెలియజేస్తారన్నారు. ఘాట్‌రోడ్డులో ఎటువంటి భయం లేకుండా నడపటానికి కొండవీడు ఘాట్‌రోడ్డు, కోటప్పకొండ ఘాట్ రోడ్డులో స్వయంగా బస్సును నడిపిస్తార న్నారు. శిక్షణ పూర్తి అయ్యాక ఫారం-5, ఫారం 5ఎ సర్టిఫికెట్లు జారీ చేస్తామని, తద్వారా అభ్యర్థి ఆర్‌టిఎ నిర్వహించే టెస్ట్‌లో పాల్గొని లెసెన్స్ పొందవచ్చన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 8897371003, 7382894585 తెలియ జేయాలన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో యాజమాన్యం, గురువులు

సిబిఎస్ఇ టెన్త్, ఇంటర్

ఫలితాల్లో సత్తాచాటిన వివేక విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలి

సిబిఎస్ఇ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో పట్టణానికి చెందిన వివేకానంద సెంట్రల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. నూరు శాతం ఉత్తీర్ణతను సాదించినట్లు డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ రావు వెల్లడించారు. బుర్రిపాలెం రోడ్డులోని స్కూల్ ఆవరణలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పదోతరగతిలో ఎస్.జ్యోతిక 96శాతం, షేక్ షమీం 95 శాతం మార్కులు సాధించారు. 12వ తరగతిలో వి.భావన 92 శాతం సాధించనట్లు చెప్పారు. అంతే కాకుండా ఎంఎస్ఎస్‌కె కార్తీక్, జి.సుహాస్, కె.శ్రీకంఠ 90శాతం మార్కులు సాధించగా పదిలో పదిలో 34మంది, 12లో 30 మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారు. లాంగ్వేజెస్ తెలుగులో 99శాతం, ఇంగ్లీష్‌లో 96శాతం మార్కులతో సత్తాచాటారు. ఉత్తమ ఫలితాలు సాధించటం ద్వారా మానవ వనరుల శాఖా మంత్రి అభినందనలు పొదటం విద్యాసంస్థకే గర్వకారణంగా చెప్పారు. సత్తాచాటిన విద్యార్థులను రావిపాటి వెంకట్రామ్, అధ్యాపకులు అభినందంచారు. కార్యక్రమంలో వివేక విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డూరెక్టర్లు జి.వెంకటరత్నం, డాక్టర్ కె.రామరాజు, సిఈవో ఉదయకిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్నాడులో గణనీయంగా పెరిగిన పోలింగ్ శాతం

- మంగళవారం తెల్లవారుజాము వరకు కొనసాగిన పోలింగ్
- 85.69 శాతం నమోదైనట్లు వెల్లడించిన అధికారులు
- అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్న మహిళలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పాటు దీటుగా రాణిస్తున్నారని సందర్భాల్లో అనేకమంది చెబుతూనే ఉన్నారు. వ్యవసాయం ఉద్యోగం వ్యాపారం ఇలా అన్ని రంగాలలో మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారు. గత సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు ఓటు హక్కు పై మహిళా ఓటర్లలో చైతన్యం వెల్లువెత్తిందని చెప్పాలి. పల్నాడు జిల్లాలో ని ఏడు నియోజకవర్గాలలో పోలింగ్ పరిశీలిస్తే అన్ని నియోజకవర్గాలలో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పాటు ఓటు హక్కును కూడా పురుషుల కంటే కాస్త ఎక్కువగానే ఓటు హక్కు వినియోగించుకొని ఓటు హక్కు పట్ల తమ స్ఫూర్తిని చాటుకున్నారు.

ఎటువంటి సందర్భంలో అయినా మహిళలకు ఏం తెలుసులే అని తక్కువ అంచనా వేయడం పరిపాటిగా మారింది. ప్రధానం గ్రామీణ ప్రాంతాలలో నివసించే మహిళలను పొలం పనులు ఇంటి వంట పని మినహా ఏమి తెలియని వారిగా భావిస్తారు. ఏమీ తెలియని వారికి ఏమైనా చెబితే వింటారు. తెలియని విషయం తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. అన్నీ తెలుసు అనుకునే వారికి ఎంత చెప్పినా ప్రయోజనం ఉండదు. పల్నాడు జిల్లాలో అదే జరుగుతోంది. ఉన్నత విద్య చదువుకున్న వారిలో చాలామంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు ఆసక్తి చూపడం లేదు. చదువుకున్న వాళ్ళు వారికి అంతా తెలుసు అనే విధంగా భావిస్తారు. కానీ వారిలో చాలామంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుకు రావడం లేదంటే వారిలో ఎంతమేర నిర్లక్ష్యం కనిపిస్తోందో తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. చాలామంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపించలేదు. ఎన్నికల సంఘం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రచారం చేశారు. సెలబ్రెటీల ద్వారా కూడా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఇటువంటి పరిస్థితుల్లో పల్నాడు జిల్లాలో ఉన్న మహిళలు అధిక శాతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో పల్నాడు జిల్లాలో అత్యధికంగా 85.69 శాతం పోలింగ్ నమోదయింది. పల్నాడు జిల్లాలో



అమరావతి మండలం అత్తులూరులో మంగళగవారం రాత్రి ఓటు వేయడానికి వేచి ఉన్న గ్రామస్తులు

మొత్తం 8.88 లక్షల మంది మహిళా ఓటర్లు ఉండగా 7.59 లక్షల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నియోజకవర్గాలలో పోలింగ్ శాతం

పెదకూరపాడు నియోజకవర్గంలో 232453 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళా ఓటర్లు 119039 మంది ఉన్నారు. వీరిలో 105469 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో పోలింగ్ శాతం 89.18 గా నమోదైంది. నరసరావుపేట నియోజకవర్గంలో మొత్తం 232778 మంది ఓటర్లు ఉండగా వీరిలో 119596 మంది మహిళలు ఉండగా 96646 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోవడంతో 89.06 శాతం పోలింగ్ నమోదైంది.

చిలకలూరిపేట నియోజకవర్గంలో 226 646 మంది ఓటర్ల ఉండగా వీరిలో 118205 మందిగా ఉన్న మహిళా ఓటర్లు 104472 మంది తమ ఓటు హక్కును వినియోగించు కోవడంతో 85.44 శాతం పోలింగ్ నమోదైంది. సత్తెనపల్లి నియోజకవర్గంలో 242047 మంది ఓటర్లు ఉండగా 123635 మంది ఉన్న మహిళా ఓటర్లలో 107381 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో సత్తెనపల్లి నియోజకవర్గంలో 86.97% పోలింగ్ నమోదయింది. వినుకొండ నియోజకవర్గంలో 264550 మంది ఓటర్లు ఉండగా వీరిలో 133365 గా ఉన్న మహిళలు 119263 మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో అత్యధికంగా వినుకొండ నియోజకవర్గం లో 89.22% పోలింగ్ నమోదయింది. మాచర్ల నియోజక వర్గంలో 262404 మంది ఓటర్ల ఉండగా వీరిలో 1,33,743 మంది గా ఉన్న మహిళా ఓటర్లలో 115538 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు దీంతో మాచర్ల నియోజకవర్గంలో 83.63% పోలింగ్ నమోదయింది. గురజాల నియోజకవర్గంలో 2,73,971 మంది ఓటర్లు ఉండగా వీరిలో 140576 మంది గా ఉన్న మహిళా ఓటర్లలో 118219 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 84.30% పోలింగ్ నమోదయింది.



పెదకూరపాడులో పోలింగ్

నరసరావుపేటలో 144 సెక్షన్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల సందర్భంగా సోమవారం మధ్యాహ్నం నుండి పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట నియోజకవర్గంలో జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో మంగళవారం పట్టణంలో జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి, ఎస్పీ జి బిందు మాధవ్ లు సిఆర్పిఎఫ్ బలగాలు స్థానిక పోలీసులతో కలిసి పట్టణంలో కవాతు నిర్వహించారు. మళ్లీ వివాదాలు చెలరేగే ఆస్కారం ఉన్న నేపథ్యంలో టిడిపి వైసిపి పార్లమెంటు మరియు నియోజకవర్గ కార్యాలయం వద్ద ఆయా పార్టీల కార్యకర్తలు నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో ఉండరాదని పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉంచుతున్నట్లు వెల్లడించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించలేదని నరసరావుపేటలో ప్రశాంత వాతావరణ నెలకొల్పేందుకు పోలీసు రెవెన్యూ అధికారులు చేస్తున్న కృషికి ప్రజలు ఆయా పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

తిరుగు పయనమైన ఓటర్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లు ఎన్నికల తిరుగు పయన మయ్యారు. వివిధ ప్రాంతాలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోసం వెళ్లిన వారు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించు కున్నేందుకు సొంత ఊళ్లకు వచ్చారు. ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఇంతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను రప్పించారు. ఎన్నికల అనంతరం ఓటర్లు తిరుగు ప్రయాణమయ్యారు. ఆర్టీసీ బస్సులు కోసం ప్రయాణికులు పడిగాపులు పడ్డారు. ప్రయాణికులకు తగ్గట్టుగా బస్సులు లేకపోవటంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



సత్తెనపల్లిలో పడిగాపులు పడుతున్న ప్రయాణికులు